ప్రజాశక్తి
బుధవారం 27 మార్చి 2024
5
శ్రీ సత్యసాయి





సమావేశంలో పాల్గొన్న శింగనమల వైసిపి అసమ్మతి నేతలు

పడిపోతున్న భూగర్భజలాలు..!









ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

భూగర్భ జలాలు పాతాళానికి పడిపోతున్నాయి. 2023 ఖరీఫ్ సీజన్ ప్రారంభం నుంచి వర్షాభావ పరిస్థితులు నెలకొన్నాయి. అనంతపురం జిల్లాలో -1.87 మీటర్లు పడిపోగా సత్యసాయి జిల్లాలో 2.9 మీటర్లు అధికంగా పడిపోయాయి. వచ్చే నెలకు ఇవి మరింత పడిపోయే సూచనలు కనిపిస్తున్నాయి. భూగర్భ జలాలు తగ్గిపోతుండటంతో ఇప్పటికే గ్రామాలు, పట్టణాల్లో దాహార్తి నెలకొంటోంది సత్యసాయి జిల్లాలో ఓడీసీ తదితర మండలాల్లో ఇప్పటికే ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేయాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి. బోరు బావుల్లోనూ నీరు తగ్గిపోవడంతో పంటలు ఎండిపోతున్నాయి.

వర్షపాతం తక్కువే..!

అనంతపురం జిల్లాలో సాధారణ వర్షపాతం 456 మిల్లీమీటర్లు అయితే 340.41 మిల్లీమీటర్లు మాత్రమే నమోదయింది. సాధారణం కంటే 23 శాతం తక్కువ వర్షపాతం నమోదయింది. సత్యసాయి జిల్లాలో సాధారణ వర్షపాతం 525.71 మిల్లీమీటర్లు పడాల్సి ఉండగా 401 మిల్లీమీటర్లు మాత్రమే నమోదయ్యింది. వర్షాభావం కారణంగా ఇప్పటికే కరువు మండలాలు ప్రకటించారు. రబీలోనూ కరువు పరిస్థితులే నెలకొన్నాయి. ఈ ప్రభావం వేసవి మొదలు కావడంతో మరింత తీవ్రమైంది. భూగర్భ జలాలు వడివడిగా పడిపోతున్నాయి. ఫిబ్రవరి నుంచి భూగర్భ జలాలు తగ్గిపోతున్నాయి. సీజన్ ప్రారంభంలో 7.39 మీటర్లు వరకు నీళ్లు ఉండేవి. ఫిబ్రవరి మాసంకు 11.91 మీటర్లకు పడిపోయాయి. -1.87 మీటర్లు తగ్గిపోయాయి. సత్యసాయి జిల్లా 7.91 మీటర్ల నుంచి 13.57 మీటర్లు పడిపోయాయి. గత నెలతో పోలిస్తే ఈ నెలకు 2.9 మీటర్ల లోతుకుపోయాయి. మండలాల వారీగా ఎక్స్ప్లాయిటెడ్ గ్రామాలు కూడా ఎక్కువ అవుతున్నాయి. అనంతపురం జిల్లాలో ఆరు గ్రామాలుంటే, సత్యసాయి జిల్లాలో 42 గ్రామాల్లో ఎక్స్ప్లాయిటెడ్ ఉన్నాయి.

ఎండుతున్న పంటలు... మొదలైన దాహార్తి..

వర్షాభావంతో బోరుబావుల్లోనూ నీటి మట్టం పడిపోతోంది. దీంతో బోరుబావులపై ఆధారపడి పంటలు సాగు చేసిన రైతులకు ఇబ్బందులు తప్పడం లేదు. గార్లదిన్నె మండలం ముకుందాపురం గ్రామంలో అత్యధికంగా బత్తాయి పంట సాగవుతుంది. అన్ని పంటలు బోరుబావులపైనే ఆధారపడి సాగవుతున్నాయి. బోరుబావుల్లో నీరు ఇంకిపోవడంతో ట్యాంకర్ల ద్వారా పంటలను కాపాడుకుంటున్నారు. ఇలాంటి పరిస్థితి అనేక చోట్ల మొదలైంది. సత్యసాయి జిల్లాలో 40కిపైగా గ్రామాల్లో నీటి సమస్య ఉంది. అనంతపురం జిల్లాలోనూ మొదలైంది. నీటి సమస్యను అధిగమించేందుకు కలెక్టరేట్‌లో కమాండ్ కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశారు. ఏదైనా సమస్య వచ్చిన వెంటనే యుద్ధప్రాతిపదికన పరిష్కరించే విధంగా ఏర్పాట్లు చేసామని అధికారులు చెబుతున్నారు.

శింగనమల అభ్యర్థిని మార్చాల్సిందే..!

◆ వైసిపి అసమ్మతి నేతల పట్టు
◆ అడ్డంకులు సృష్టించినా కొనసాగిన సమావేశం

ప్రజాశక్తి-నార్పల, శింగనమల

శింగనమల అధికార పార్టీ రాజకీయం రోజురోజుకూ వేడెక్కుతోంది. అధిష్టానం అభ్యర్థిని ప్రకటించిన రోజు నుంచి అసమ్మతి నేతలు నిరసనగళం విన్పిస్తూనే ఉన్నారు. ప్రస్తుత అభ్యర్థి ఎం.వీరాంజినేయులను మార్చాల్సిందే అంటూ పట్టుబడుతున్నారు. మంగళవారం నాడు ఏకంగా నియోజకవర్గంలోని ఆరు మండలాలకు చెందిన వైసిపి అసమ్మతి నేతలు సమావేశం నిర్వహించి అధిష్టానం ప్రకటించిన అభ్యర్థి వద్దని, వెంటనే మార్చాలని డిమాండ్ చేశారు. అభ్యర్థిని మార్చకుంటే శింగనమలలో వైసిపి ఓటమని ఖాయం అని తెలియజేశారు.

సమావేశంకు అనంతలో అనుమతి నిరాకరణ.. శింగనమలలో కొనసాగింపు..!

శింగనమల వైసిపి అభ్యర్థిని మార్చాలని కోరుతూ అసమ్మతి నేతలు అనంతపురంలో మంగళవారం నాడు సమావేశం ఏర్పాటు చేసుకున్నారు. ఇందుకు సంబంధించి మూడు రోజుల ముందు నుంచే సామాజిక మాధ్యమాల ద్వారా ఈ సమాచారాన్ని నియోజకవర్గంలోని నేతలందరికీ పంపారు. కాగా మంగళవారం నాడు అనంతపురంలో జరిగే సమావేశంలో పాల్గొనేందుకు వెళ్తున్న నాయకులను ఎక్కడికక్కడ పోలీసులు అడ్డుకున్నారు. శాంతిభద్రతల దృష్ట్యా సమావేశం నిర్వహించేందకు అనుమతి లేదంటూ అనంతపురంలోని బళ్లా కన్వెషన్ హాల్‌కు తాళాలు వేశారు. దీంతో వైసిపి అసమ్మతి నాయకులు వారి సమావేశాన్ని అప్పటికప్పుడు శింగనమల నియోజకవర్గ కేంద్రం సమీపంలోని పెద్దమ్మ గుడి వద్దకు మార్చుకున్నారు. ఈ విషయాన్ని సామాజిక మాధ్యమాల ద్వారా సందేశం పంపారు. ఈ సమాచారం అందుకున్న వైసిపి నాయకులు పెద్ద సంఖ్యలోనే పెద్దమ్మ ఆలయం వద్దకు చేరుకున్నారు. నార్పల సత్యనారాయణ రెడ్డి, గార్లదిన్నె నారాయణరెడ్డి, తరిమెల గోకుల్ రెడ్డి, చన్నంపల్లి రాజశేఖర్ రెడ్డి, దళితనాయకులు మిద్దె కుళ్లాయప్ప, చాములూరు రాజగోపాల్, రామకృష్ణ తదితరులు పాల్గొని అభ్యర్థిని మార్చాలని అధిష్టానానికి తెలియజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇంతకాలం నియోజకవర్గంలో పార్టీ అభ్యున్నతికి కషి చేసిన వ్యక్తులకు కాకుండా ఎవరో నామినేట్ చేసిన వ్యక్తిని అభ్యర్థిగా ప్రకటించడం సరికాదన్నారు. పార్టీ కోసం కష్టపడిన కార్యకర్తల ఆవేదనను అర్థం చేసుకుని జగన్మోహన్ రెడ్డి అభ్యర్థిని మారుస్తూ నిర్ణయం తీసుకోవాలని కోరారు. అనంతరం నాయకులు అందరూ కలిసికట్టుగా అభ్యర్థిని మార్చాలంటూ నిర్ణయం తీసుకున్నారు. వైసిపి అధినేత జగన్మోహన్‌రెడ్డి శింగనమల అభ్యర్థిని మారుస్తూ నిర్ణయం తీసుకోవాలని లేకుంటే పార్టీకి నష్టం తప్పదని తెలియజేశారు.

హిందూపురం పార్లమెంట్

టీడీపీ అధ్యక్షుడిగా బివి.వెంకటరాముడు



బివి.వెంకటరాముడు

ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్

హిందూపురం పార్లమెంటు టిడిపి అధ్యక్షుడిగా బివి.వెంకటరాముడును నియమించింది. ఈ మేరకు మంగళవారం నాడు టిడిపి రాష్ట్ర అధ్యక్షులు అచ్చెన్నాయుడు ఒక ప్రకటన విడుదల చేశారు. ఇప్పటి వరకు ఆ బాధ్యతల్లో మాజీ ఎమ్మెల్యే బికె.పార్థసారధి ఉన్నారు. ఆయన్ను హిందూపురం పార్లమెంట్ అభ్యర్థిగా ఇటీవల ప్రకటించారు. ఆయన స్థానంలో బివి.వెంకటరాముడును టిడిపి జిల్లా అధ్యక్షునిగా నియమించారు. బివి.వెంకటరాముడు అనేక సంవత్సరాలు ఉమ్మడి అనంతపురం జిల్లా ప్రచార కార్యదర్శిగా ఉన్నారు. టిడిపి జాతీయ అధ్యక్షులు నారా లోకేశ్ యువగళం పేరుతో పాదయాత్ర చేపట్టిన సమయంలో మీడియా కో ఆర్డినేటర్‌గా వ్యవహరించారు. రాష్ట్ర వ్యాప్తంగా మొత్తం పాదయాత్ర కార్యక్రమంలో ఆయన పాలుపంచుకున్నారు. అనేక సంవత్సరాలుగా పార్టీకి కట్టుబడి పనిచేస్తున్న ఆయనకు ఇప్పుడు హిందూపురం పార్లమెంట్ అధ్యక్ష పదవి దక్కింది. బివి.వెంకటరాముడు 1999లో తెలుగుదేశం పార్టీ పట్టణ కమిటీ కార్యదర్శిగా, 2003లో తెలుగుదేశం పార్టీ జిల్లా కమిటీ కార్యదర్శిగా, 2004 నుంచి 2023 వరకు ఉమ్మడి అనంతపురం తెలుగుదేశం పార్టీ జిల్లా కమిటీ ప్రచార కార్యదర్శిగా, 2022లో రాయలసీమ మీడియా కో-ఆర్డినేటర్‌గా, 2023లో నారా లోకేష్ యువగళం పాదయాత్ర రాష్ట్ర మీడియా కో-ఆర్డినేటర్‌గా, 2024 నుంచి నారా లోకేష్ శంఖారావం రాష్ట్ర మీడియా కో-ఆర్డినేటర్ పని చేశారు. జిల్లాలో అందరూ సీనియర్ నాయకులతోనూ సత్ససంబంధాలు కలిగిన నాయకుడిగా బివి.వెంకటరాముడు ఉన్నారు.

17న జిల్లాస్థాయి ఎడ్లబండ్ల పోటీలు

ప్రజాశక్తి గోరంట్ల రూరల్

మండలంలోని కరావులపల్లి తండాకు చెందిన సునీత శంకర్ లాల్ నాయక్ ఆధ్వర్యంలో ఏప్రిల్ 17న శ్రీరామనవమి సందర్భంగా జిల్లాస్థాయి ఎద్దుల బండ్ల పోటీలు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు సునీత శంకర్‌లాల్ నాయక్ తెలిపారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇదే గ్రామానికి చెందిన తాను హైదరాబాద్‌లో స్థిరపడ్డానని అన్నారు. అయితే సొంత గ్రామ అభివృద్ధికి తనవంతు సహకారాన్ని అందిస్తున్నట్లు చెప్పారు. అందులో భాగంగా ప్రతిఏటా శ్రీరామనవమి పండుగ సందర్భంగా జిల్లా స్థాయి ఎద్దుల బండ్ల పోటీలు నిర్వహించేందుకు ఏర్పాట్లు సిద్ధం చేశామన్నారు. ఈ పోటీల్లో మొదటి బహుమతి రూ. 60వేలు, రెండవ బహుమతి రూ. 50వేలు, మూడవ బహుమతి రూ. 40వేలు, నాలుగవ బహుమతి రూ. 30వేలు, ఐదవ బహుమతిగా రూ. 20వేలు అందజేస్తున్నామన్నారు. రైతులు సంస్కృతి సాంప్రదాయాలను మరవకుండా తమ పద్ధతులను ఇలాగే కొనసాగించడానికి ప్రతి ఏడాది ఈ పోటీలను నిర్వహించడం జరుగుతుందని సునీత శంకర్ లాల్ నాయక్ తెలిపారు. ఈ పోటీల్లో పాల్గొనడానికి ఎంట్రీఫీజు రూ. 500 చెల్లించి పేరు నమోదు చేయించుకోవాలని కోరారు. ఇతర వివరాలకు 9912187783, 9000895664 సెల్‌నెంబర్లకు ఫోన్ చేయాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో మాజీ సింగిల్ విండో అధ్యక్షులు గంపల రమణారెడ్డి, జెడ్పీటీసీ పాలే జయరాం నాయక్, చింతా రామచంద్రారెడ్డి, సర్పంచ్ ప్రమీల ముసలిరెడ్డి, సామాజిక సేవకులు పుట్టగుండ్ల పల్లి వెంకట శివ రెడ్డి, రాజేష్ నాయక్, ఎం శ్రీనివాస్ నాయక్, బిల్లు నాయక్, తిరుపాల్‌నాయక్, ఎం. బాలు నాయక్ పాల్గొన్నారు.



పోటీల వివరాలు వెల్లడిస్తున్న గ్రామస్తులు

పక్కాగా ఎన్నికల నియమావళి అమలు

కలెక్టర్ పి. అరుణ్ బాబు



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ అరుణ్‌బాబు

ప్రజాశక్తి-పుట్టపర్తి అర్బన్

రానున్న సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి ఎన్నికల ప్రవర్తనా నియమావళిని పక్కగా అమలు చేయాలని కలెక్టర్ పి.అరుణ్‌బాబు అధికారులకు సూచించారు. మంగళవారం స్థానిక కలెక్టరేట్లోని స్పందన సమావేశ మందిరంలో ఎన్నికలకు సంబంధించిన పలు అంశాలపై నియోజకవర్గ ఎన్నికల అధికారులు, సెక్టార్ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎస్పీ మాధవరెడ్డి, జాయింట్ కలెక్టర్ అభిషేక్ కుమార్, పెనుగొండ సబ్ కలెక్టర్ అపూర్వ భరత్, డిఆర్‌ఓ కొండయ్య తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని 27 మంది అధికారులను వివిధ టీంలలో నోడల్ అధికారులకు ఏర్పాటు చేశామన్నారు. ఎన్నికల విధులు నిర్వర్తించే అధికారులకు ఏప్రిల్ మొదటి వారంలో శిక్షణ కార్యక్రమం ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. రిటర్నింగ్ అధికారులు ఎక్కడా చిన్న పొరపాటు తలెత్తకుండా ఎన్నికల ప్రక్రియను పూర్తిచేయాలని తెలిపారు. ఎన్నికల కమిషన్ ఆదేశాలను వందశాతం అమలు చేయాలన్నారు. ఎన్నికల కోడ్ ఉల్లంఘన నిర్ధారణ జరిగితే సత్వరమే ఎన్నికల కమిషన్ లేదా జిల్లా ఎన్నికల అధికారికి సమాచారం ఇవ్వాలని తెలిపారు. ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థుల ప్రచారానికి సంబంధించి అన్ని అనుమతులు పొందే విధంగా చర్యలు చేపట్టాలని సూచించారు. ఈ ఎన్నికల్లో వద్ధులు, దివ్యాంగులకు ఇంటి నుంచి ఓటు వేసే వెసులుబాటును ఎన్నికల సంఘం (ఈసీ) అందుబాటులోకి తెచ్చిందని, దీనిపై ఆయా పోలింగ్ కేంద్రాల పరిధిలో ఓటర్లకు అవగాహన కల్పించాలన్నారు. ఎస్పీ మాధవరెడ్డి మాట్లాడుతూ సార్వత్రిక ఎన్నికలను పకడ్బందీగా నిర్వహించేందుకు పోలీసు యంత్రాంగం ద్వారా అన్ని చర్యలూ చేపట్టామని తెలిపారు. ఎన్నికల నిర్వహణలో భాగంగా పోలీస్ యంత్రాంగం పూర్తి సహాయ సహకారాలు అందిస్తుందని తెలిపారు. జిల్లా సరిహద్దుల్లో ఏర్పాటు చేసిన చెక్‌పోస్టుల వద్ద ప్రత్యేక నిఘా బందాలను ఏర్పాటు చేశామని తెలిపారు. పోలింగ్ కేంద్రాల్లో వెబ్ కాస్టింగ్ విధానం కూడా అమలు చేస్తున్నట్లు ఎస్పీ తెలిపారు. ఎన్నికల దశ్య అక్రమ, నగదు, మద్యం, డ్రగ్స్ ఆయుధాలు వస్తువులు తదితర వాటి అంతరాష్ట్ర తరలింపుపై కూడా పోలీసు యంత్రాంగం ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉండి పకడ్బందీ చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ ఎన్నికల అధికారులు పుట్టపర్తి భాగ్యరేఖ, కదిరి వంశీకష్ణ, ధర్మవరం వెంకట శివ సాయి రెడ్డి, మడకశిర గౌరీ శంకర్, డీఎస్పీలు, సిఐలు, నోడల్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

వైసిపిలో పలువురు చేరిక

ప్రజాశక్తి ధర్మవరం టౌన్

పట్టణంలోని ఎమ్మెల్యే నివాసంలో మంగళవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో 16, 26 వార్డులకు చెందిన 325 కుటుంబాలు టీడీపీ సానుభూతిపరులు, ఇతరపార్టీల వారు వైసిపిలో చేరారు. వారందరికి ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి వైసిపి కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. ఆనంతరం ఎమ్మెల్యే కేతిరెడ్డి మాట్లాడుతూ రాష్ట్రాభివృద్ధి వైసిపితోనే సాధ్యమని అన్నారు. వచ్చే ఎన్నికల్లో కూడా వైసిపిని ఆదరించి జగన్‌ను ముఖ్యమంత్రిగా చేసుకుందామన్నారు. ఈ కార్యక్రమంలో 16వవార్డు కౌన్సిలర్ కేతా లోకేష్, 26వవార్డు పరిశీలకులు మేడాపురం సూరి, వైసిపి పట్టణాధ్యక్షులు కోటిరెడ్డి బాలిరెడ్డి, నీలూరిప్రకాష్, కౌన్సిలర్లు మాసపల్లి సాయికుమార్, గోరకాటి పురుషోత్తంరెడ్డి, గజ్జల శివ, వైసిపి జిల్లా అధికార ప్రతినిధి గుర్రం శీన,నాయకులు చాంద్‌బాషా, అమీర్‌బాషా, తొండమాల రవి, శంకర్ యుగంధర్, తరుణికంటి రమేష్, బీరే కేశవ, తీర్థాల వెంకటరమణ,బైముతక రమణ, పరంధామ రెడ్డి, చందు, చింతా భాస్కర్, ఈశ్వర్ రెడ్డి, రెడ్డి, తోపుదుర్తి వెంకట రాముడు, పురుషోత్తం, కాలంగి సీనా, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

టిడిపితోనే రాష్ట్రాభివృద్ధి

ప్రజాశక్తి - మడకశిర

టిడిపితోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమనినియోజకవర్గ టిడిపి అభ్యర్థి డాక్టర్ సునీల్ కుమార్, మాజీ ఎమ్మెల్యే ఈరన్న, వీఎం పాండురంగప్ప అన్నారు. మంగళవారం నియోజకవర్గ పరిధిలోని గుడిబండ మండలం శంకరగల్లు, రాళ్ళపల్లి పంచాయతీలో ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు.ఈసందర్భంగా వారు ఇంటింటికి వెళ్లి సూపర్ సిక్స్ పథకాల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీలు కృష్ణమూర్తి, ఆదినారాయణ, బొజ్జప్ప, అశ్వర్థామప్ప, కష్ణప్ప, రమేష్, రాజగోపాల్, జయరామ్ రెడ్డి, నియోజకవర్గంలోని ఐదు మండలాల తెలుగుదేశం పార్టీ నాయకులు కార్యకర్తలు, పాల్గొన్నారు.



ఎన్నికల ప్రచారంలో నాయకులు

నాయీబ్రాహ్మణుల అభివృద్ధే లక్ష్యం

ప్రజాశక్తి పుట్టపర్తి క్రైమ్

మున్సిపాలిటీ పరిధిలోని నాయీ బ్రాహ్మణుల అభివృద్ధే లక్ష్యంగా నాయీ బ్రాహ్మణ సేవా సంఘం పనిచేస్తుందని ఆ సంఘం నాయకులు తెలిపారు. మంగళవారం ఆసంఘం జిల్లా గౌరవ అధ్యక్షులు, మాజీ ఉపాధ్యాయుడు బి. శ్రీనివాసులు ఆధ్వర్యంలో పట్టణ నాయీ బ్రాహ్మణుల సేవా సంఘం నూతన కమిటీని ఎన్నుకున్నారు. పట్టణ అధ్యక్షులుగా సుగమంచి శ్రీనివాసులు, ఉపాధ్యక్షులుగా సుగమంచి సుబ్రమణ్యం, కానుగుల క్రిష్టప్ప, ప్రధాన కార్యదర్శిగా ప్రవీణ్ కుమార్, కోశాధికారి మల్లేపల్లి జయచంద్ర, జాయింట్ సెక్రటరీగా సుఖమంచి వెంకటరమణను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్షుడు సుగమంచి నాగరాజు, నాయకులు రమణ, వెంకటేష్, గోపాల్, గురు ప్రసాద్, అశోక్, మురళి, పెడపల్లి భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

టిడిపి జిల్లా అధ్యక్షుడి నియామకంపై హర్షం

పుట్టపర్తి రూరల్: హిందూపురం పార్లమెంట్ అధ్యక్షులుగా బీవీ వెంకటరాముడిని నియమించడంపై మాజీ మంత్రి పల్లె రఘునాథ్ రెడ్డి హర్షం వ్యక్తం చేశారు. పార్టీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబునాయుడుకి, రాష్ట్ర అధ్యక్షులు అచ్చెంనాయుడికి, జాతీయ పార్టీ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ బాబుకు పల్లె రఘునాథ్ రెడ్డి కృతజ్ఞతలు తెలిపారు.

కొత్తచెరువు : శ్రీ సత్యసాయి జిల్లా టిడిపి జిల్లా అధ్యక్షుడిగా వడ్డెర కులానికి చెందిన బివి. వెంకటరమణను నియమించడం పట్ల టిడిపి టౌన్ కన్వీనర్ వలిపి శ్రీనివాసులు, టిడిపి నాయకులు నల్లమాడ శంకర్,పెద్దన్న, ఆలకుంట శ్రీనివాసులు, వెంకటేశ హర్షం వ్యక్తం చేశారు. వెంకటరమణ పార్టీకి చేసిన సేవలను గుర్తించి ఈ పదవిని ఇవ్వడం పట్ల పార్టీ అధిష్టానానికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో శ్రీనివాసులు, పెద్దక్క, తదితరులు పాల్గొన్నారు

ఎన్నికల నియమాలపై రాజకీయ పార్టీలతో సమావేశం

ప్రజాశక్తి-హిందూపురం

సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో రాజకీయ పార్టీల ప్రతినిధులకు ఎన్నికల నియమాలపై మండల తహశీల్దార్ కార్యలయంలో తహశీల్దార్ శివప్రసాద్, మున్సిపల్ కమిషనర్ శ్రీకాంత్ రెడ్డి ఆధ్వర్యంలో అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. వైసిపి, తెలుగుదేశం, జనసేన, బీఎస్పీ, కాంగ్రెస్, ఇతర పార్టీల ప్రతినిధులు ఈ సమావేశానికి హాజరయ్యారు. ఈసందర్భంగా అధికారులు మాట్లాడుతూ ఎన్నికల నియమావళి ఉల్లంఘిస్తే సివిజన్ యాప్ లో ఫిర్యాదు చేయాలని సూచించారు. సభలు, సమావేశాలకు తప్పనిసరిగా పోలీసుల అనుమతి తీసుకోవాలని సూచించారు. ఈ సమావేశంలో లేపాక్షి తహశీల్దార్ బాల నరసింహులు, ఎన్నికల డిప్యూటీ తహశీల్దార్ రెడ్డి శేఖర్ తో పాటు ఇతర అధికారులు, వివిధ పార్టీల నాయకులు పాల్గొన్నారు.

పది పరీక్ష కేంద్రం తనిఖీ

ప్రజాశక్తి - లేపాక్షి

మండల కేంద్రంలోని పదవ తరగతి పరీక్షలు నిర్వహిస్తున్న నాలుగు కేంద్రాలను జిల్లా విద్యా అధికారిని మీనాక్షి ఆదివారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె పరీక్ష కేంద్రం ల వద్ద విద్యార్థుల కల్పిస్తున్న సౌకర్యాలు గురించి ఆరా తీశారు. ఈ కార్యక్రమంలో స్థానిక ఎంఇఒ నాగరాజు నాయక్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సూర్య,చంద్ర ప్రభ వాహనాలపై ఖాద్రీశుడు

ప్రజాశక్తి కదిరి అర్బన్

కదిరి లక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాలు కనుల పండువగా నిర్వహిస్తున్నారు. మంగళవారం పగలు సూర్యప్రభ వాహనం, రాత్రి సమయములో చంద్రప్రభ వాహనంపై స్వామివారు దర్శనమిచ్చారు. ఆలయాన్ని దర్శించుకోవడానికి పలు రాష్ట్రాల నుంచి భక్తులు తరలివస్తున్నారు. నిత్య అన్నదానం కొనసాగిస్తున్నట్లు ఆలయ ఈవో శ్రీనివాసరెడ్డి తెలిపారు. స్వామివారి ఉత్సవం వద్ద తమిళనాడు నాదస్వరం వాయిద్య కళాకారులు తమ గానంతో భక్తులను ఆకట్టుకున్నారు. ఆవరణంలో ఏర్పాటు చేసిన కళ్యాణ వేదికపై సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకుంటున్నాయి. డీఎస్పీ శ్రీలత ఆదేశాల మేరకు పట్టణ సిఐ పుల్లయ్య ఆధ్వర్యంలో బందోబస్తు ఏర్పాటు చేశారు. గ్రామీణ సర్కిల్ ఇన్స్పెక్టర్ వెంకటేశ్వర్లు, ఎస్ఐ వారి సిబ్బందితో బందోబస్తు నిర్వహించారు.



సూర్యప్రభ వాహనంపై శ్రీవారు

న్యాయవాదుల సంఘం అధ్యక్షులుగా రాజశేఖర్

ప్రజాశక్తి-హిందూపురం

హిందూపురం న్యాయవాదుల సంఘం అధ్యక్షులుగా ఇ. రాజశేఖర్ ఎన్నికయ్యారు. మంగళవారం జరిగిన ఎన్నికల్లో 4 ఓట్ల మెజార్టీతో రాజశేఖర్ విజయం సాధించారు. ఎన్నికల అధికారి, సీనియర్ న్యాయవాది రామరత్నం శాస్త్రి పర్యవేక్షణలో మంగళవారం బార్ అసోసియేషన్ అధ్యక్ష స్థానానికి న్యాయవాదులు నాగరాజు, హిదయతుల్లా ఖాన్ ఎన్నికలను నిర్వహించారు. బార్ అసోసియేషన్ లో మొత్తం 123 మంది ఓటర్లు ఉండగా 110 ఓట్లు పోలయ్యాయి. ఇందులో రాజశేఖర్ కు 47 ఓట్లు రాగా వన్నెరప్పకు 43, కెహెచ్ గోపాల్‌కు 20 ఓట్లు వచ్చాయి. దీంతో రాజశేఖర్ నాలుగు ఓట్ల తేడాతో విజయం సాధించినట్లు ఎన్నికల అధికారి ప్రకటించారు. అనంతరం ప్రధాన కార్యదర్శిగా జి. శ్రీనివాస్ రెడ్డి, ఉపాధ్యక్షులుగా మురళి, ఆంజనేయులు, సంతోషి కుమారి, సంయుక్త కార్యదర్శులు గా రత్నమ్మ, హెచ్ కె వెంకటేశ్వరరావు, కోశాధికారిగా ఈశ్వరప్ప, గ్రంథాలయ ఇన్‌ఛార్జిగా రవిచంద్ర, మీడియా కోఆర్డినేటర్ గా ఫణి భూషణ్ లను ఎన్నుకున్నారు. అదేవిధంగా కార్యవర్గ సభ్యులుగా రామ రత్నం శాస్త్రి, శ్రీరాములు, సిద్దు, బీవీ రంగారెడ్డి, నాగభూషణ్ రావు, రామచంద్రారెడ్డి, హిదయతుల్లా ఖాన్, కళావతిని ఎన్నుకున్నారు.

చెట్లకు రక్షణ కల్పించాలి

ప్రజాశక్తి-హిందూపురం

జిల్లాలో పచ్చని చెట్లను పట్ట పగలే నరుకుతున్న ఏ ఒక్కరు పట్టించుకోవడం లేదని పర్యావరణ వేత్తలు భాస్కర్ నాయుడు, భాస్కర్ రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. మంగళవారం లేపాక్షి మండల కేంద్రం, పోలీస్ స్టేషన్ సమీపంలో 8 చింత చెట్లను నరకడంపై వారు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. జిల్లాలో వాల్టా చట్టాన్ని కాపాడాలన్నారు. కొంతమంది అటవీ అధికారుల స్వార్థం వల్ల పచ్చని చెట్లను కోల్పోతున్నామని ఆరోపించారు. రెండు రోజుల క్రితం చిలమత్తూరు మండలం వీరాపురం వద్ద వలస పక్షుల నివాసాల వద్ద దాదాపు 100 చెట్లు నరకినప్పటికి అటవీశాఖ అధికారులు చోద్యం చూశారే తప్ప ఇప్పటి వరకు చర్యలు తీసుకోలేదని విమర్శించారు. కరువు జిల్లాలో వేల టన్నుల కలప కళ్ల ముందే సామిల్లకు, ఇటుక బట్టీలకు రవాణ అవుతోందన్నారు. ప్రతిరోజు అక్రమంగా చెట్లు నరికి వ్యాపారం నిర్వహిస్తున్న వారిపై ఎప్పుడైనా చర్యలు తీసుకున్నారా అని ప్రశ్నించారు.



నరికివేసిన చెట్లను చూపుతున్న పర్యావరణవేత్తలు

ప్రజాశక్తి www.prajasakti.com

దంత వ్యాధులపై అవగాహన

పుట్టపర్తి రూరల్ : పుట్టపర్తి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యులు దంత వ్యాధులపై అవగాహన కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. వైద్యాధికారి డాక్టర్ జ్యోత్స్న డాక్టర్ జయశ్రీ అధ్వర్యంలో మంగళవారం ఎనమలపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో వారు మాట్లాడుతూ దంత సంరక్షణ గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో సిహెచ్ఓ నగేష్, పిహెచ్ఎన్టిబి సూపర్ వైజర్లు అబిద్, రాజేశ్వరి సిబ్బంది పాల్గొన్నారు

'పది' పరీక్షలకు 95 శాతం హాజరు

కొత్తచెరువు : జిల్లా వ్యాప్తంగా మంగళవారం జరిగిన బయాలజీ సైన్స్ పరీక్షలో 95 శాతం విద్యార్థులు హాజరయ్యారని డీఈవో మీనాక్షి, తెలిపారు జిల్లావ్యాప్తంగా 115 కేంద్రాల్లో పరీక్షలు నిర్వహించగా 25,733 మందికి గాను 24,430 మంది విద్యార్థులు హాజరయ్యారన్నారు. అన్ని కేంద్రాల్లో ప్రశాంతంగా ఈ పరీక్షలు నిర్వహించామన్నారు.

'టిడిపి వెంటే ఉంటాం'

కదిరి అర్బన్ : తాము టిడిపి వెంటే ఉంటామని మైనార్టీ నాయకులు, కౌన్సిలర్ బాబా ఫక్రుద్దీన్ తదితరులు పేర్కొన్నారు. మంగళవారం టిడిపి నాయకులు అభిజ్ఞా ఫౌండేషన్ నిర్వాహకులు పవన్ కుమార్ రెడ్డి కార్యాలయంలో పవన్ కుమార్ రెడ్డికి మైనార్టీలు సత్కరించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ కుల, మతాలు చూడకుండా అభివృద్ధి చేసే నాయకులను ప్రజాప్రతినిధులుగా చేయడమే కదిరి నియోజకవర్గ మైనార్టీల ధ్యేయమని అన్నారు.

మృతురాలి కుటుంబానికి ఆర్థికసాయం

కదిరి టౌన్ : మండలంలోని ఈతోడు గ్రామం ఉప్పవాండ్లపల్లికి చెందిన డేరంగుల వెంకట లక్ష్మమ్మ మృతిచెందింది. విషయం తెలుసుకున్న వైసిపి రాష్ట్ర బిసి విభాగం ఉపాధ్యక్షులు బత్తల హరిప్రసాద్ మృతురాలి కుటుంబానికి ఆర్థికసాయం అందజేశారు. మృతురాలి కుటుంబ సభ్యులు డేరంగుల శీనకు రూ. 10వేలు అందజేశారు.ఈ కార్యక్రమంలో నర్సిరెడ్డి జనార్దన్ రెడ్డి, సునీల్ కుమార్ రెడ్డి, శివారెడ్డి, మహ్మదుల్లారెడ్డి, వెంకటరమణ, షామీర్ సాబ్, వెంకటరమణ, శ్రీనాథ్ రెడ్డి, చిర్రి పురుషోత్తం రెడ్డి ఫరూఖ్ తదితరులు పాల్గొన్నారు

మోడల్ స్కూల్లో ఇంటర్ ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

ధర్మవరం టౌన్ : ఏపీ మోడల్ స్కూల్లో ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం ప్రవేశం కోసం విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని ఏపీ మోడల్ స్కూల్ ప్రిన్సిపల్ పద్మశ్రీ కోరారు. ఈ మేరకు ప్రిన్సిపల్ మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు.కళాశాలలో ఇంగ్లీష్ లో ఉచిత బోధన ఉంటుందన్నారు. పదో తరగతి ఉత్తీర్ణులైన విద్యార్థులు మాత్రమే దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. పదో తరగతి మార్కుల మెరిట్ ద్వారా రిజర్వేషన్ రూల్స్ ప్రకారం ప్రవేశాలు ఉంటాయని తెలిపారు. ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు రూ.150, ఓసీ, బీసీ విద్యార్థులు రూ.200లు చెల్లించి ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు.

ముఖ్యమైన సేవలు అందించే ఉద్యోగులకు పోస్టల్ బ్యాలెట్

పుట్టపర్తి అర్బన్ : నిత్యవసర సేవను అందించే 33 విభాగాల వారికి పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు సదుపాయం కల్పిస్తున్నట్లు కలెక్టర్ అరుణ్ బాబు తెలిపారు. ఈ మేరకు మంగళవారం కలెక్టరేట్ నుంచి ఒక ప్రకటన విడుదలైంది. సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి విధులలో పాల్గొనే 33 నిత్యావసర సేవలు అందించే శాఖలకు చెందినవారికి కేంద్ర ఎన్నికల సంఘం పోస్టల్ బ్యాలెట్ సదుపాయాన్ని కల్పిస్తుందని కలెక్టర్ తెలిపారు. ఈ అవకాశాన్నిఉద్యోగులు అందరూ వినియోగించుకోవాలని ఆయన కోరారు.

వైసిపికి పలువురు రాజీనామా

గాండ్లపెంట: మండలంలోని వైసిపికి చెందిన పలువురు ఆపార్టీకి రాజీనామా చేశారు. వైసిపి మాజీ సింగల్ విండో అధ్యక్షుడు అప్పి రెడ్డి వెంకటరమణారెడ్డి, వేపరాల ఎంపీటీసీ జి సోమశేఖర్ రెడ్డి, కురుమామిడి సర్పంచి సి సుధాకర్, ఉప సర్పంచి బి నర్సారెడ్డి తదితర కార్యకర్తలు టిడిపికి రాజీనామా చేసినట్లు విలేకరులకు తెలిపారు. ఈ కార్యక్రమంలో కార్యకర్తలు జి సిద్ధారెడ్డి డి ఆనంద్ అక్రమ్ తదితరులు పాల్గొన్నారు



వివరాలు వెల్లడిస్తున్న నాయకులు

ప్రశాంత వాతావరణంలో ఎన్నికల నిర్వహణకు చర్యలు

ఎస్పీ మాధవరెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న ఎస్పీ

ప్రజాశక్తి పుట్టపర్తి రూరల్

ఎన్నికల సమయంలో ఫ్యాక్షన్ ప్రభావిత గ్రామాలపై నిఘా ఉంచి ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు జరిగే విధంగా చర్యలు చేపట్టాలని జిల్లా ఎస్పీ మాధవ్ రెడ్డి ఆదేశించారు. మంగళవారం స్థానిక జిల్లా పోలీస్ కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాల్లో నెలవారీ నేర సమీక్ష సమావేశం నిర్వహించారు ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూఎన్నికల సమయం దగ్గర పడే కొద్దీ పోలీస్ వ్యవస్థ చాలా అప్రమత్తంగా ఉండాలన్నారు. క్రికెట్ బెట్టింగ్ ల పై పోలీసులు నిఘా ఉంచాలన్నారు. డీఎస్పీలు, సిఐలు, ఎస్ఐలు నేర నివారణకు గట్టి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఎన్నికల సమయంలో పాత నేరస్తులపై ప్రత్యేక నిఘా ఉంచాలన్నారు. స్ట్రాంగ్ రూమ్‌ల దగ్గర సిసి కెమెరాలతో పకడ్బందీ నిఘా ఉంచాలన్నారు. సమస్యాత్మక ప్రాంతాలలో పోలీసు బలగాలతో రూట్ మార్చ్, ఫ్లాగ్ మార్చ్ చేయించాలని గన్ లైసెన్సులను అన్నింటిని డిపాజిట్ చేయించాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ విష్ణు, డీఎస్పీలు, సిఐలు, ఎస్ఐలు తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో పాల్గొన్న నాయకులు

చంద్రబాబు సభను విజయవంతం చేద్దాం

ప్రజాశక్తి - కదిరి టౌన్

వైసీపీ పాలనలో అధోగతి పాలైన రాష్ట్రాన్ని అభివృద్ధి దిశగా నడిపేందుకు టిడిపి, జనసేన, బిజెపి ఉమ్మడి కుటమి ఏర్పాటు అయిందని కూటమిని ప్రజలందరూ ఆశీర్వదించాలని టిడిపి, జనసేన నియోజకవర్గ ఇన్‌ఛార్జులు కందికుంట వెంకటప్రసాద్, భైరవ ప్రసాద్ పేర్కొన్నారు. మంగళవారం పట్టణంలోని కందికుంట నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతు సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో రాష్ట్ర వ్యాప్తంగా వైసీపీ ప్రజా వ్యతిరేక విధానాలను ప్రజలకు వివరిస్తూ ప్రజాగళం పేరుతో చంద్రబాబు సుడిగాలి పర్యటనకు శ్రీకారం చుట్టారన్నారు. అందులో భాగంగా ఈనెల 28 న చంద్రబాబు కదిరికి రానున్నారని చెప్పారు. చంద్రబాబు పర్యటనను విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు వేణుగోపాల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

తనకల్లు : టిడిపి అధినేత నారా చంద్రబాబు నాయుడు కదిరి నియోజకవర్గ పర్యటనను విజయవంతం చేయాలని ఆపార్టీ మండల కన్వీనర్ రెడ్డిశేఖర్‌రెడ్డి కోరారు. మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ చంద్రబాబు పర్యటనను విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు బడా రాజారెడ్డి, నాగేంద్ర ప్రసాద్, కావిడి ప్రవీణ్ కుమార్, తోట సరోజమ్మ తదితరులు పాల్గొన్నారు.

సూర్యనారాయణకే టికెట్ ఇవ్వాలి

ధర్మవరంలో మద్దతుదారుల ర్యాలీ

ప్రజాశక్తి-ధర్మవరం టౌన్

కూటమిలో భాగంగా ధర్మవరం టికెట్టు కేటాయింపు ఒక కొలిక్కి వచ్చే అవకాశం కన్పించడం లేదు. టిడిపి, జనసేన, బిజెపి కూటమిలో భాగంగా ఈ టికెట్టును బిజెపికి కేటాయించారు. బిజెపి నంచి మాజీ ఎమ్మెల్యే గోనుగుంట్ల సూర్యనారాయణ బరిలో నిలుస్తారని పెద్ద ఎత్తున ప్రచారం జరిగింది. ఇందుకు సంబంధించి సూర్యనారాయణ మద్దతుదారులు ఎన్నికల ప్రచారాన్ని కూడా నిర్వహించారు. గత మూడు రోజులుగా ధర్మవరం స్థానం నుంచి బిజెపి అభ్యర్థిగా మరొకరు ఉంటారనే ప్రచారం సామాజిక మాధ్యమాల్లో విస్తృతంగా జరుగుతోంది. ఈ నేపథ్యంలో సూర్యనారాయణ మద్దతు దారులు మంగళవారం నాడు ఆందోళనకు దిగారు. సూర్య నారాయణకు టికెట్టు ఇవ్వాలని కోరుతూ మంగళవారం ఉదయం ధర్మవరంలో భారీ ర్యాలీ నిర్వహించారు. మారుతీరాఘవేంద్రస్వామి కల్యాణమండపం నుంచి ప్రారంభం అయిన ర్యాలీ పోలీసు ఆర్టీసీ బస్టాండ్ వరకు కొసాగింది. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ గోనుగుంట్ల సూర్యనారాయణ 2014-19 మధ్యకాలంలో ఎమ్మెల్యేగా ఉంటూ ధర్మవరం అభివృద్ధికి ఎనలేని కృషి చేశారన్నారు. అలాంటి వ్యక్తికి టికెట్టు ఇవ్వకుండా స్థానికేతరునికి ఇవ్వాలనుకోవడం సరికాదన్నారు. ఈ ర్యాలీలో బిజెపి నాయకులు డిష్ రాజు, చిగిచెర్ల అరవిందరెడ్డి, గొట్లూరు చంద్ర, తుంపర్తి పరమేశ్, దేవరకొండ రామకృష్ణ, టైలర్ కుళ్లాయప్ప, నబీరసూల్, చిలకం సూర్యనారాయణరెడ్డి, బొడగల గిరిధర్, బెస్తశివ, మల్కాపురం హరి, మార్కెట్ రహీం, రామ్మూర్తినాయుడు, వీరన్న, గంధమనేని నారాయణస్వామి, బోయనపల్లి సుజాత, గరుగు పద్మావతి పాల్గొన్నారు.



సూర్యనారాయణకు మద్దతుగా ధర్మవరంలో ర్యాలీ

కలసికట్టుగా పనిచేద్దాం : బికె



సమావేశంలో మాట్లాడుతున్న పార్థసారథి

ప్రజాశక్తి -పెనుకొండ

వచ్చే ఎన్నికల్లో టీడీపీ గెలుపు కోసం అందరం కలసి కట్టుగా పనిచేద్దామని హిందూపురం పార్లమెంట్ కూటమి అభ్యర్థి బికె. పార్థసారథి పిలుపునిచ్చారు. మంగళవారం పట్టణంలోని టీడీపీ కార్యాలయంలో బికె. పార్థసారథి అధ్వర్యంలో పెనుకొండ నియోజకవర్గ సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి నియోజకవర్గం పరిశీలకులు డాక్టర్ నరసింహ రావు, ఎమ్మెల్యే అభ్యర్థి సవితమ్మ పాల్గొన్నారు. ఈ సందర్భంగా పార్థసారథి మాట్లాడుతూ ఎన్నికల సంగ్రామంలో సైనికుల్లా పని చేద్దామన్నారు. వచ్చే ఎన్నికల్లో పెనుకొండ నియోజకవర్గ, హిందూపురం పార్లమెంటు అభ్యర్థులను అత్యధిక మెజారిటీతో గెలిపించాలని కోరారు. పార్టీలో ఎలాంటి గ్రూపులు ,విభేదాలు లేవని అందరూ కలిసి కట్టుగా పని చేద్దామని ఎమ్మెల్యే అభ్యర్థి సవితమ్మ పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వైసిపి పాలనకు చరమగీతం పాడేందుకు ప్రజలంతా ఎదురు చూస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు కురుబ కృష్ణమూర్తి, పార్టీ మండల కన్వీనర్లు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పలువురు టిడిపిలో చేరిక : పట్టణంలోని టీడీపీ కార్యాలయంలో హిందూపురం పార్లమెంటు కూటమి అభ్యర్థి బికె. పార్థసారథి సమక్షంలో నియోజకవర్గములోని గోరంట్లకు చెందిన పలువురు టిడిపిలో చేరారు. మౌలాలి, బాచాన్నపల్లి గ్రామానికి చెందిన సాబ్ జాన్‌తో పాటు 5 కుటుంబాలు వైసిపి నుండి తెలుగుదేశం పార్టీలో చేరారు.ఈ సందర్భంగా పార్టీ లోకి చేరిన వారికి పార్థసారథి టిడిపి కండువాలు వేసి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్ సోమశేఖర్, నాయకులు పాల్గొన్నారు.



గోరంట్లలో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతున్న సవితమ్మ

టీడీపీతోనే అభివృద్ధి : సవితమ్మ

ప్రజాశక్తి -పెనుకొండ

పెనుకొండ నగర పంచాయతీ అభివృద్ధి టీడీపీతోనే సాధ్యం అని ఆపార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి సవితమ్మ పేర్కొన్నారు. మంగళవారం నగర పంచాయతీ పరిధిలోని 14 ,15 వార్డులో టీడీపీ ఉమ్మడి ఎమ్మెల్యే అభ్యర్థి సవితమ్మ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా సవితమ్మ వార్డుల్లో ఇంటింటికి తిరుగుతూ గత టీడీపీ ప్రభుత్వంలో పట్టణంలో జరిగిన అభివృద్ధిని ప్రజలకు వివరించారు. తిరిగి అభివద్ధి కావాలంటే టిడిపిని గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు వెంకటరమణ, టీడీపీ వార్డు ఇన్‌ఛార్జి బాబుల్ రెడ్డి, నాయకులు శ్రీరాములు, రమణమ్మ, చంద్రకాంతమ్మ, షౌకత్, నారాయణస్వామి, అరుణ్ కుమార్ రెడ్డి, షమి, బాబిరెడ్డి, సుబ్రహ్మణ్యం, హరి, మణి, మూర్తి, టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

గోరంట్ల : సార్వత్రిక ఎన్నికల్లో టిడిపి గెలుపే లక్ష్యంగా పనిచేద్దామని టిడిపి అభ్యర్థి సవితమ్మ కోరారు. పట్టణంలో తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో క్లస్టర్, బూత్ ఇన్‌ఛార్జులతో మంగళవారం సమావేశం నిర్వహించారు. మేనిఫెస్టో సూపర్ సిక్స్ పథకాలను ఓటర్లకు వివరిస్తూ తెలుగుదేశం పార్టీ అత్యధిక మెజార్టీతో గెలుపునకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని ఆమె కోరారు. ఈ కార్యక్రమంలో అబ్జర్వర్ నరసింహరావు, కన్వీనర్ సోమశేఖర్, జిల్లా కార్యదర్శి వేణు, నాయకులు జయరాం, శ్రీనివాసులు, మరిరెడ్డిపల్లి నరసింహులు, సుధాకర్ రెడ్డి, ఉమర్ ఖాన్, బెల్లాల చెరువు చంద్ర తదితరులు పాల్గొన్నారు.

ప్రజాదరణ చూస్తుంటే వైసీపీ గల్లంతు ఖాయం : పల్లె

ఓబుళదేవర చెరువు : ఈ ఎన్నికల్లో వైసీపీ పార్టీ గల్లంతు కావడం ఖాయమని మాజీ మంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డి జోస్యం చెప్పారు. ఓడి చెరువు మండల కేంద్రంలో సుమారు 200 కుటుంబాలకు పైగా వైసీపీ నుంచి టీడీపీలోకి చేరాయి. మాజీ మంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డి సమక్షంలో టీడీపీ అభ్యర్థి పల్లె సింధూర రెడ్డి, ఆమె భర్త పల్లె వెంకటకృష్ణ కిషోర్ రెడ్డి, జనసేన ఇన్‌ఛార్జి పత్తి చంద్రశేఖర్ సమక్షంలో పార్టీలోకి చేరారు. వారికి టీడీపీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో అరాచక పాలనకు చరమగీతం పాడాలన్నారు.ఈ ఎన్నికల్లో టిడిపి ఉమ్మడి కూటమి అధికారంలోకి వస్తేనే ఏపీ అభివృద్ధి జరుగుతుందని అన్నారు. పుట్టపర్తి నియోజకవర్గ టిడిపి అభ్యర్థి పల్లె సింధూర మాట్లాడుతూ చంద్రబాబు అధికారంలోకి వస్తేనే అభివృద్ధి సాధ్యమని అన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి కన్వీనర్ జయచంద్ర, మాజీ జెడ్పీటీసీ పిట్టా ఓబుల్ రెడ్డి, సర్పంచి శంకర్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి పీట్ల సుధాకర్, సొదీ నాగరాజు, ఆరిఫ్ ఖాన్, డాక్టర్ జాకీర్, బడిశం రామాంజి, ఇర్షాద్, షాను, నిజాం, ఓబుల్ రెడ్డి, బోయపల్లి శివారెడ్డి, అంజినప్ప, చాంద్‌బాషా, షబ్బీర్ తదితరులు పాల్గొన్నారు.

టిడిపిలో చేరిన వాలంటీర్ కుటుంబం

పుట్టపర్తి క్రైమ్ : మండల పరిధిలోని కంబలపర్తికి చెందిన గ్రామవాలెంటీర్ కుటుంబం టిడిపిలోకి చేరింది. గ్రామంలోని ఎస్సీ కాలనీ వాసులు పెద్ద అంజనప్ప, అతని కుమారుడు వాలంటీర్ కిరణ్, కోడలు మమత, కుమార్తె భారతి, కుటుంబం మొత్తం వైసీపీని వీడి టిడిపిలో చేరారు. ఈ మేరకు వారు మంగళవారం మాజీ మంత్రి పల్లె రఘునాథ్ రెడ్డి ఆధ్వర్యంలో టిడిపిలో చేరారు.



టిడిపిలోకి చేరిన వాలెంటీర్ కుటుంబసభ్యులతో పల్లె

వైసిపి పాలనలోనే పేదలకు న్యాయం

మంత్రి ఉషశ్రీ చరణ్



పార్టీలోకి చేరిన వారితో మంత్రి ఉషశ్రీ చరణ్, తదతరులు

ప్రజాశక్తి -పెనుకొండ

సిఎం జగనన్న పాలనలోనే పేదలకు న్యాయం జరుగుతుందని రాష్ట్ర స్త్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రి ఉషశ్రీ చరణ్ పేర్కొన్నారు. మంగళవారం నగర పంచాయతీ పరిధిలోని 13వ వార్డులో గల చెరువుగేరిలో వైసిపి ఎమ్మెల్యే అభ్యర్థి ఉషశ్రీ చరణ్ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి ఇంటింటికి తిరుగుతూ ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలు గురించి ప్రజలకు వివరించారు. రాష్ట్రం అభివృద్ధి జరగాలన్నా, సంక్షేమ పథకాలు తిరిగి గడప వద్దకు అందాలన్నా జగనన్నను మరోసారి ముఖ్యమంత్రిని చేసుకుందాం అని కోరారు. ఈ కార్యక్రమంలో వైస్ చైర్మన్ సునీల్, సింగిల్ విండో అధ్యక్షులు సల్లా సూర్యప్రకాష్ రెడ్డి, టౌన్ కన్వీనర్ నరసింహ,కౌన్సిలర్లు సుధాకర్ రెడ్డి, క్రిష్ట, రఘునాథ్ రెడ్డి, గణేష్, సద్దాం, శేషాద్రితదితరులు పాల్గొన్నారు.

వైసిపిలో పలువురు చేరిక : పట్టణంలోని మంత్రి క్యాంప్ కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో నియోజకవర్గంలోని గోరంట్ల మండల పరిధిలోని పెరుమాలపల్లి గ్రామానికి చెందిన పలువురు టిడిపి నాయకులు వైసిపిలో చేరారు. గ్రామానికి చెందిన కృష్ణకుమార్ యాదవ్, సుధాకర్ యాదవ్, అంజినప్ప, కురుబ నారాయణస్వామి, రవి యాదవ్, శివ, విశ్వనాథ, మల్లికార్జున తదితరులు వైపిపిలో చేరారు. వారికి మంత్రి వైసిపి కండువా వేసి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

రోడ్డు ప్రమాదంలో 'పది' విద్యార్థులకు గాయాలు

బుక్కపట్నం : మండల పరిధిలోని సిద్దరాంపురం గ్రామ సమీపన జరిగిన ఆటో ప్రమాదంలో సిద్దరాంపురం గ్రామానికి చెందిన విద్యార్థులకు తీవ్ర గాయాలు అయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాల మేరకు మంగళవారం బుక్కపట్నం మండల కేంద్రంలో పదవ తరగతి పరీక్షలు హాజరైన విద్యార్థులు తిరిగి సిద్దరాంపురం వెళుతున్న సమయంలో ప్రమాదవశాత్తూ ఆటో అదుపుతప్పి బోల్తాపడింది. ఈ ప్రమాదంలో పదవ తరగతి విద్యార్థులకు తీవ్ర గాయాలు అయ్యాయి. విషయం తెలుసుకున్న డిఇఒ మీనాక్షి, ఆర్డీవో భాగ్యరేఖ, తహశీల్దార్ భారతి హాస్పిటల్ వెళ్లి గాయపడ్డ విద్యార్థులను పరామర్శించారు. ప్రమాదానికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు.



గాయపడిన విద్యార్థిని పరామర్శిస్తున్న డిఇఒ

వ్యక్తి ఆత్మహత్య

ఓబుళదేవరచెరువు : మండలంలోని వీరప్ప గారి పల్లి చెందిన ఇడగొట్టు భూపతి (36) అనే వ్యక్తి ఆత్మహత్య పాల్పడినట్లు ఎస్ఐ వంశీకృష్ణ తెలిపారు. భూపతి తాగుడుకు బానిసై అతని భార్య అశ్వినినితరచూ వేధించేవాడన్నారు. ఈ నేపథ్యంలో సోమవారం రాత్రి భార్యభర్తలు గొడవపడ్డారన్నారు. భార్య ఇంటిబయట నిద్రిస్తుండగా భూపతి ఇంటిలోకి వెళ్లి సీలింగ్ ఫ్యాన్ కు ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడని తెలిపారు. మృతుని భార్య ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. మతునికి భార్య, ఒక కుమారుడు, ఒక కుమార్తె ఉన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఆటోడ్రైవర్ మృతి

ధర్మవరం టౌన్ : రోడ్డు పక్కన ఆగిఉన్న ఆటోను వెనుక వైపునుంచి లారీ వేగంగా వచ్చి ఢీకొన్న ప్రమాదంలో ఆటో డ్రైవర్ ధనుంజయరెడ్డి(40) మృతిచెందాడు. టూటౌన్ పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. చెన్నేకొత్తపల్లి మండలం బసినేపల్లి గ్రామానికి చెందిన ధనుంజయరెడ్డి కూరగాయల వ్యాపారం చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకునేవాడు. ప్రతిరోజు ధర్మవరానికి తన ఆటోలో వచ్చి కూరగాయలను కొనుగోలు చేసి తిరిగి గ్రామానికి వెళ్లి వ్యాపారం చేసుకునేవాడు. ఈ క్రమంలో మంగళవారం తెల్లవారుజామున కూడా కూరగాయల కోసం ఆటోలో ధర్మవరానికి వచ్చాడు. అయితే ఆటోకు డీజిల్ వేయించుకోవడానికి ధర్మవరం పట్టణంలోని మార్కెట్‌యార్డ్ వద్దగల పెట్రోల్ బంకు వద్దకు వెళ్లాడు. అక్కడ రోడ్డు పక్కన తన ఆటోను ఉంచాడు. ఈ క్రమంలో తాడిపత్రి నుంచి లారీ వేగంగా దూసుకువచ్చి రోడ్డు పక్కన ఉన్న ఆటోను వెనుక వైపు ఢీకొంది.ఈ ప్రమాదంలో ఆటోలో ఉన్న ధనుంజయ అక్కడిక్కడే మృతిచెందాడు. ప్రమాదానికి కారణమైన లారీ డ్రైవర్ పరారయ్యాడు.ఈ విషయం తెలుసుకున్న టూటౌన్ పోలీసులు సంఘటనాస్థలాన్ని పరిశీలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ధర్మవరం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. మతునికి భార్య సునీత, ఒక కుమారుడు, ఒక కుమార్తె ఉన్నారు.

వాహనాల తనిఖీ

ఓబుళదేవర చెరువు: మండల పరిధిలోని గాజుకుంట్లపల్లి తదితర ప్రాంతాల్లో ఎస్ఐ వంశీకృష్ణ ఆధ్వర్యంలో పోలీసులు వాహనాలను తనిఖీ చేశారు. ఎన్నికల దృష్ట్యా ముందస్తు జాగ్రత్త చర్యలో భాగంగా వాహనాలు తనిఖీ చేసినట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎఎస్ఐ కిషోర్ రెడ్డి, పోలీసులు పాల్గొన్నారు.

బెంగుళూరులో రోడ్డు ప్రమాదం.. ధర్మవరం వాసి మృతి..

ధర్మవరం టౌన్ : ధర్మవరం మండలం ఉప్పునేశనపల్లి గ్రామానికి చెందిన రైతు సాయినాథ్(47) సోమవారం సాయంత్రం బెంగుళూరులో జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతిచెందాడు. కుటుంబసభ్యులు, బంధువులు తెలిపిన వివరాల మేరకు... ధర్మవరం మండలం ఉప్పునేశనపల్లి గ్రామానికి చెందిన సాయినాథ్ ఐదేళ్లక్రితం బెంగుళూరుకు వలస వెళ్లాడు. అక్కడ చిక్కళ్లిలో లోకేశ్కు చెందిన ఐదెకరాల భూమిని కౌలుకు తీసుకుని కుటుంబాన్ని పోషించుకునేవాడు. ఈ క్రమంలో తన చిన్నకుమార్తె బేబిని స్కూల్ నుంచి తన ద్విచక్రవాహనంలో పిలుచుకొని వస్తుండగా ఎదురుగా వస్తున్న మరో ద్విచక్రవాహనాన్ని తప్పించబోయి అదుపు తప్పి రోడ్డు ప్రక్కన ఉన్న విద్యుత్ స్తంభాన్ని డీకొన్నాడు. ఈ ప్రమాదంలో సాయినాథ్ తీవ్రంగా గాయపడ్డాడు.క్షతగాత్రుడిని స్థానికంగా ఉన్న ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ సోమవారం రాత్రి మృతిచెందినట్లు మృతుని బంధువులు తెలిపారు. మతునికి భార్య వెంకటలక్ష్మి, కుమార్తెలు బిందు, బేబీ ఉన్నారు. బింధు ఇంటర్ ద్వితియసంవత్సరం, బేబి 8వతరగతి బెంగుళూర్లోనే చదువుతున్నారు. కుటుంబ పెద్ద దిక్కుకోల్పోవడంతో కుటుంబసభ్యులు చేస్తున్న రోదనలు కంటతడి పెట్టించాయి.

అభివృద్ధిని చూసి ఓటెయ్యండి

ప్రజాశక్తి కదిరి అర్బన్

సంక్షేమ పథకాల అమలులో చరిత్ర సృష్టించిన వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీని వచ్చే ఎన్నికల్లో గెలిపించడంతోపాటు జగనన్నను మరోసారి ముఖ్య మంత్రిని చేసుకుందా మని వైసిపి అభ్యర్థి మక్బూల్ సతీమణి బిఎస్ దిల్షాద్ పర్వీన్ మక్బూల్ పేర్కొన్నారు. మంగళవారం కదిరి మున్సిపల్ పరిధిలోని 6, 24వ వార్డులలో ఎమ్మెల్యే అభ్యర్థి బిఎస్ మక్బూల్ కు మద్దతుగా నిర్వహించిన ఎన్నికల ప్రచారంలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా వార్డులోని ప్రతి గడపకు వెళ్లి వైసిపి చేసిన అభివృద్ధిని వివరించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ పరికి నజీమున్నీసా, వైస్ చైర్‌పర్సన్ కొమ్ము గంగాదేవి, కౌన్సిలర్లు రాంప్రసాద్, షాహిన్, కోఆప్షన్ మెంబర్ బాబా ఫక్రుద్దీన్, వైసిపి నాయకులు దుర్గం బాబ్జాన్, సనావుల్లా, షమీర్ తదితర నాయకులు పాల్గొన్నారు.



వైసిపి ఎన్నికల ప్రచారం

చింతచెట్లు తొలగించిన వారిపై చర్యలు

లేపాక్షి : మండల కేంద్రం లోని స్థానిక పోలీస్ స్టేషన్ సమీపంలో సోమవారం రాత్రి ఎనిమిది చింత చెట్లను తొలగించిన వారిపై చర్యలు తీసుకుంటామని అటవీ శాఖ అధికారి అక్బర్ తెలిపారు. ఈ మేరకు ఆయన మంగళవారం సంఘటన స్థలాన్ని పరిశీలించారు. హిందూపురం నుండి చిలమత్తూరు వెళ్లే ప్రధాన రహదారి లో అనుమతులు లేకుండా చింతచెట్లు తొలగించారన్నారు.

మైదుగోళంలో టీడీపీ ఎన్నికల ప్రచారం

లేపాక్షి : మండలం పరిధిలో మైదుగోళం గ్రామంలో మంగళవారం తెలుగుదేశం పార్టీ మండలం కన్వీనర్ జయప్ప ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో హిందూపురం శాసనసభ్యులు బాలకృష్ణ వ్యక్తిగత సహాయకులు శ్రీనివాస్ రావ్, స్థానిక సర్పంచి రామచంద్ర రెడ్డి, మాజీ ఎంపీపీ ఆనంద్ కుమార్, మాజీ జెడ్పీటీసీ రామాంజినమ్మ, మాజీ మార్కెట్ యార్డ్ చైర్మన్ క్రిష్టప్ప తదితరులు పాల్గొన్నారు.

అర్చకులపై దాడి హేయం

మడకశిర : కాకినాడలో అర్చకులపై దాడి చేసిన వారిపై తగిన చర్యలు తీసుకోవాలని బ్రాహ్మణ సంఘం జిల్లా కార్యదర్శి ఎస్ రవి భూషణ్ డిమాండ్ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ అర్చకులపై చేసిన దాడిని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. నిందితులపై తక్షణం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బ్రాహ్మణ సంఘ నాయకులు రవి కుమార్, శ్రీధర్, శ్రీనివాస్, సురేష్, చంద్రమౌళి తదితరులు పాల్గొన్నారు.

కలసి పనిచేయండి : నాగబాబు

ప్రజాశక్తి-హిందూపురం

హిందూపురం నియోజక వర్గంలో అందరితో కలిసి పని చేసి విజయం సాధించాలని జనసేన నేత నాగబాబు హిందూపురం జనసేన నాయకులకు సూచించారు. మంగళవారం మంగళగిరిలో పురం నాయకులు నాగబాబును కలిశారు. పొత్తులో భాగంగా టీడీపీ, బీజేపీ పార్టీలతో కలసి పనిచేసి, ఉమ్మడి ప్రభుత్వం అధికారంలోకి రావడం కోసం శక్తి వంచన లేకుండా కృషి చేయాలని నాగబాబు సూచించారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఆకుల ఉమేష్, చిన్నా తదితరులు పాల్గొన్నారు.